
సెలవు రోజు కావడంతో స్వామివారిని దర్శించుకోవడానికి వస్తున్న విద్యార్థులు

# జన జాతర


జాతరలో ఏర్పాటు చేసిన ఆటవస్తువులు

- బుగ్గ ఉత్సవాలకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన ఆలయ పరిసర ప్రాంతాలు
- వైభవంగా కొనసాగుతున్న బుగ్గరామలింగేశ్వరుడి జాతర


స్వయంభు శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మంచాల, డిసెంబర్ 9 : మంచాల మండలం ఆరుట్ల గ్రామ సమీపంలోని బుగ్గ రామలింగశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. రెండో శనివారం సెలవు రోజు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు జిల్లాతో పాటు వివిధ ప్రాంతాలకు వచ్చిన ప్రజలతో ఆలయ పరిసర ప్రాంతాలు జన సందోహంగా మారాయి. ఎటు చూసినా కనుచూపు మేరలో భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసాయి. కుటుంబ సమేతంగా గుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామివారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు కుటుంబసమేతంగా సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. మహిళలు ఆలయ ఆవరణలో కార్తిక దీపాలను వెలిగించారు. బుగ్గ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. మంచాల సీఐ కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సమస్యను ఎప్పుడికప్పుడు పూర్తిగా పరిష్కరించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా మంచాల ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బందిని నియమించారు. ఇబ్రహీంపట్నం నుంచి భక్తుల సౌకర్యార్థం బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం వరకు గంటకు ఒక ఆర్టీసీ బస్సును నడిపిస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం అక్కడే వండుకొని వన భోజనాలను చేస్తున్నారు. అనంతరం ఆట వస్తువులు, స్వీట్లు కొనుగోలు చేస్తున్నారు.


నాగన్న పుట్ట వద్ద పూజలు

శివలింగానికి అభిషేకం చేస్తున్న చిన్నారులు, పెద్దలు



స్వామివారి దర్శనం అనంతరం వనభోజనాలు చేస్తున్న భక్తులు



# హోరెత్తిన ధారూరు మెథడిస్టు జాతర


**భారీగా తరలివస్తున్న యాత్రికులు**

**శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు**

**నేటితో ముగియనున్న జాతర**

ధారూరు, డిసెంబర్ 9 : ధారూరు మండల పరిధిలోని ధారూరు స్టేషన్– దోర్నాల్ గ్రామాల మధ్య ఉన్న మెథడిస్టు క్రిస్టియన్ జాతరకు భక్తులు శనివారం పోటెత్తారు. ధారూరు మెథడిస్టు జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కాలినడకన తరలివస్తున్నారు. మెథడిస్టు జాతర రేపు( ఆదివారం) ముగింపు ఉండడంతో శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. యాత్రికులు జాతర ప్రాంగణంలో రెండు రోజులు ఉండేందుకు గుడారాలను ఏర్పాటు చేసుకున్నారు. ఏసుక్రిస్తు శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రార్థన మందిరంలో ప్రార్థనలు చేసి బిషప్‌లు దైవ సందేశాన్ని తెలుగు, కన్నడ భాషలలో వినిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సందేశాన్ని వింటూ ఏసుప్రభువును తలుచుకున్నారు. భక్తులు శిలువ వద్ద కొవ్వొత్తులను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదివారం మెథడిస్టు జాతర ముగియనున్నందున భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయని నిర్వాహకులు తెలుపుతున్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు భారీ బందోబస్తు చేస్తున్నారు.


శిలువ వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన భక్తులు


కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు


ఇప్పచెట్టుకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



## 'కార్తికం' ఎఫెక్ట్

# చికెన్ అగ్గువ

- మొన్నటి వరకు ఎన్నికలు ఉండడంతో ఊపందుకున్న ధరలు
- ప్రస్తుతం కార్తికమాసం కావడంతో ఆసక్తి చూపని ప్రజలు
- రంగారెడ్డిజిల్లాలో ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.157
- రానున్న రోజుల్లో ఇంకా ధరలు తగ్గే అవకాశం
- పౌల్ట్రీఫారాల్లో కోళ్లు భారీగా ఉండడంతోనే తగ్గుతున్న ధరలు
- కొత్త ఏడాదిలో ధరలు పెరిగే అవకాశముందంటున్న వ్యాపారులు

షాబాద్, డిసెంబర్ 9 : మార్కెట్‌లో చికెన్ ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. వారం రోజుల క్రితం వరకు అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో ధరలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కార్తికమాసం ఉండడంతో ప్రజలు చికెన్ తినడానికి ఎక్కువగా ఆసక్తి చూపడంలేదు. చికెన్ ధరలు సగం తగ్గాయి. రంగారెడ్డిజిల్లాలో ప్రస్తుతం కిలో చికెన్ ధర విత్ స్కిన్ రూ.138 ఉండగా, స్కిన్‌లెస్ ధర 157కి పడిపోయింది. ఇంకా ధరలు తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. రెండు, మూడు నెలల క్రితం కిలో చికెన్ ధరలు రూ.250 నుంచి రూ.300 వరకు ఉండేది. కిలో చికెన్ కొందామనుకునేవారు అరకిలోతో సరిపెట్టుకున్నారు. నవంబర్ నెలలో ఎన్నికలు ఉండడంతో చికెన్‌కు భలే గిరాకీ ఉండేది. రూ.200లకు పైగానే విక్రయించారు.

### జనవరి వరకు ఇదే పరిస్థితి

గడిచిన నాలుగు నెలల్లో కిలో చికెన్ ధర చేరుకున్న కనిష్ట ధర ఇదే కావడం విశేషం. పౌల్ట్రీఫారాల వద్ద కోళ్లు భారీగా ఉండడంతో చికెన్ కేంద్రాలకు కోళ్ల కొరత లేకుండా పోయింది. ఎక్కువ రోజులు కోళ్లను ఫారాల్లో పెంచితే వాటికి మేత ఖర్చుతో పాటు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది. దీంతో తక్కువ ధరలకే రైతులు కోళ్లను వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్‌లో డిమాండ్ తగ్గి, భారీగా కోళ్లు రావడంతో ఆటోమేటిక్‌గా ధర తగ్గుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఒకవైపు చలి తీవ్రత ఎక్కువ.. మరోవైపు తుఫాన్ వర్షాల నేపథ్యంలో చికెన్ ధరలు పూర్తిగా తగ్గుముఖం పడుతున్నాయి. డిసెంబర్ నెల మొత్తం ధరలు ఇలానే ఉండనున్నాయి. కొత్త ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగకు చికెన్ ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

### వ్యాపారం తగ్గింది



ప్రస్తుతం చికెన్ వ్యాపారం బాగా తగ్గింది. కార్తికమాసం ఉండడంతో ప్రజలు చికెన్ తినేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం కిలో చికెన్ ధర రూ.157 పలుకుతున్నది. గత నెలలో ఎన్నికలు ఉండడంతో చికెన్ ధర కిలోకు రూ.200లకు పైగా పలకడంతో వ్యాపారం బాగానే నడిచింది. ప్రస్తుతం పౌల్ట్రీఫారాల్లో కోళ్లు అనుకున్న స్థాయి కంటే ఎక్కువగా ఉండడంతో ఎక్కువ రోజులు ఉంచకుండా రైతులు కోళ్లను అమ్మేస్తున్నారు. దీంతో చికెన్ ధరలు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఈ నెల చివరి వారంలో లేదా, జనవరి మొదటి వారం వరకు మళ్లీ చికెన్ ధరలు పెరిగే అవకాశం ఉంది.

**- ఎండీ అజారుద్దీన్, చికెన్ వ్యాపారి, షాబాద్**